క్లుప్తంగా

ఘనంగా గంగమ్మ జాతర



పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తనకల్లు: మండల పరిధిలోని కొర్తికోట పంచాయతీ మంగదిన్నెపల్లి గ్రామంలో ఆదివారం గంగమ్మ జాతర జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేయించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తల వెంకట రమణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ధర్మవరం అర్బన్: గురుపౌర్ణమి సందర్భంగా అరుణాచలం శివ దర్శనానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని ఆర్టీసీ డిపో మేనేజర్ మోతిలాల్‌నాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశులు తెలిపారు. జులై 2వ తేదీ ఉదయం 6 గంటలకు ధర్మవరం నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. కాణిపాకం మీదుగా వేలూరు గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకుని రాత్రికి అరుణాచలానికి బస్సు చేరుతుందన్నారు. మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు బస్సు బయలుదేరి ధర్మవరానికి చేరుకుంటుందన్నారు. రానుపోను చార్జీలు సూపర్ లగ్జరీ బస్సుకు రూ.1,400, ఎక్స్‌ప్రెస్‌కు రూ.1,160 ఉంటుందని తెలిపారు. అరుణాచలానికి ఆన్‌లైన్ రిజర్వేషన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు.

బక్రీద్ శాంతియుతంగా జరుపుకోండి



మాట్లాడుతున్న ఎస్‌ఐ గోపి

ఓడీ చెరువు: ఈనెల 29వ తేదీన ముస్లింలు బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ గోపి సూచించారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మండలంలోని ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రార్థనలు చేసుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నేటి నుంచి కుష్టు నిర్ధారణ సర్వే

నల్లమాడ: మండలంలో ఈనెల 26 నుంచి జులై 16 వరకూ కుష్టు నిర్ధారణ సర్వే నిర్వహించనున్నట్లు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ) రామాంజులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు అన్ని గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేస్తారన్నారు. ఎవరికైనా స్పర్శ లేని ఎర్రని లేదా రాగి రంగులో మచ్చలుంటే గుర్తించడం జరుగుతుందన్నారు. డాక్టర్ నిర్ధారించిన తర్వాత వారికి పూర్తి ఉచితంగా మందులు ఇస్తామన్నారు. కుష్టును సకాలంలో గుర్తిస్తే నివారించుకోవచ్చన్నారు. ఎవరికైనా స్పర్శ లేని మచ్చలు ఉంటే సమీపంలోని ఏఎన్‌ఎంను సంప్రదించాలని సూచించారు.

కరాటేతో ఆత్మస్థైర్యం



కరాటే విద్యార్థులతో వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం

ధర్మవరం: కరాటేతో ఆత్మస్థైర్యం లభిస్తుందని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో కరాటే మాస్టర్ ఇనాయత్ బాషా ఆధ్వర్యంలో బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ఈ గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన 14 మంది విద్యార్థులకు సీఐ సుబ్రహ్మణ్యం చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో విద్యార్థులకు కరాటే ఎంతో ముఖ్యమన్నారు. సమాజంలో జరుగుతున్న దాడులను అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాంగళ్య సిల్క్స్ జింకా పురుషోత్తం, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా గణేనాయక్



నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారిగా డాక్టర్ గణేనాయక్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. నల్లచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకూ రెడ్డిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిగా విధులు నిర్వహించిన డాక్టర్ కృష్ణప్రసాద్ తాడిమర్రి పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ఘనేనాయక్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

చిరుధాన్యాల సాగుతో సిరులు



గంగిరెడ్డిపల్లి వద్ద సాగవుతున్న మొక్కజొన్న



అమడగూరు వద్ద సాగులో ఉన్న రాగి



కొండకమర్ల వద్ద కళకళలాడుతున్న సజ్జ

పుట్టపర్తి అర్బన్: నియోజకవర్గంలో చిరుధాన్యాల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. స్వల్ప కాలంలో తక్కువ పెట్టుబడులతో ఆదాయాన్ని పొందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ముందస్తుగా పంటలు సాగు చేసి ఆశించిన దిగుబడులు సాధిస్తున్నారు. గత కొన్నేళ్లుగా అటవీ ప్రాంతాల రైతులు వేరుశనగ, కంది, వరి పంటల సాగుకు స్వస్తి పలికారు. చిరుధాన్యాలు, వాణిజ్య పంటలను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. గత ఐదారేళ్ల నుంచి కర్ణాటక చాకివేలు ప్రాంతానికి చెందిన వ్యాపారులు విత్తన సజ్జను ఉచితంగా అందజేస్తున్నారు. పంట పూర్తయిన తర్వాత వారే కొనుగోలు చేసేలా రైతులు ఒప్పందం చేసుకుంటున్నారు. క్వింటాల్‌కు రూ.3,600 చొప్పున చెల్లించి వ్యాపారులే సజ్జను కొనుగోలు చేస్తున్నారు. ఒక్క సజ్జ పంటే సుమారు 1,000 ఎకరాలకు పైగా సాగు చేశారు. ఎకరాకు 18 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. పుట్టపర్తి మండలంలోని సాతార్లపల్లి, గంగిరెడ్డిపల్లి, దిగువచెర్లోపల్లి, నల్లమాడ మండలంలో నల్లమాడ, కొత్తపల్లి, శేషయ్యగారిపల్లి, మురికినీళ్ల వంక తండా, చౌటకుంటపల్లి, ఎద్దులవాండ్లపల్లి, ఓడీసీ మండలం కొండకమర్ల, నవాబుకోట,గంగిరెడ్డిపల్లి, మారుతీ తండా, గజ్జికుంట బండ తండా తదితర గ్రామాల్లో అత్యధికంగా సజ్జ సాగులో ఉంది. పొద్దు తిరుగుడు పంటను సైతం విస్తారంగా సాగు చేస్తున్నారు. కొండకమర్ల చెరువు, సాతార్లపల్లి చెరువులు, గంగిరెడ్డిపల్లి చెరువుల కింద విస్తారంగా సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 2,500 ఎకరాల్లో సాగులో ఉంది. మొక్కజొన్న పంట పుట్టపర్తి, గోరంట్ల, నల్లమాడ, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో విస్తారంగా సాగైంది. ఇప్పటికే పొద్దు తిరుగుడు 3,200 ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఇక రాగి సుమారు 300 ఎకరాల్లో సాగైనట్లు సమాచారం. రాగి పంటకు ప్రభుత్వం మద్దతు ధర రూ.3,860గా ప్రకటించింది. గత నాలుగేళ్లుగా వ్యవసాయ బోరు బావుల్లో నీరు సమృద్ధిగా ఉండటంతో ఏటా చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



చిల్లవారిపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోని చిల్లవారిపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. అనంతపురం తిరుమల ఆసుపత్రి ఆధ్వర్యంలో డాక్టర్లు టీవీ కృష్ణకాంత్‌రెడ్డి, ఆర్.సింధు, కే.దివాకర్, పి.తేజశ్విని, ఇంతియాజ్, శివశంకర్‌రెడ్డి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి, షుగర్, గుండె, కిడ్నీ, ఎముకలు, స్త్రీల వ్యాధులను పరీక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్టు పెద్ద శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగిరెడ్డి నారాయణరెడ్డి, పిట్టు పరమేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ర్యాలీ

ఓడీ చెరువు: మండల కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తనకల్లు సెబ్ ఎస్‌ఐ శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ర్యాలీలో ఓడీసీ ఎస్‌ఐ గోపి, మండలంలోని మహిళా పోలీసులు, స్థానికులు పాల్గొనాలన్నారు.

ప్రజా సేవలో రోటరీక్లబ్ ముందంజ



ప్రమాణ స్వీకారం చేసిన రోటరీక్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు



ప్రమాణ స్వీకారం చేసిన ఇన్నర్‌వీల్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

ధర్మవరం అర్బన్: ప్రజా సేవలో రోటరీక్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని రోటరీక్లబ్ అసిస్టెంట్ రీజనల్ కో-ఆర్డినేటర్ శ్రీరామమూర్తి, అసిస్టెంట్ గవర్నర్ తిమ్మారెడ్డి తెలిపారు. పట్టణంలోని సాంస్కృతిక మండలిలో ఆదివారం రోటరీక్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. రోటరీక్లబ్ నూతన అధ్యక్షుడిగా జయసింహ, కార్యదర్శిగా నాగభూషణ, కోశాధికారిగా సుదర్శన్ గుప్తాతో ముఖ్య అతిథులు ప్రమాణం చేయించారు. అలాగే ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలిగా నాగరత్న, కార్యదర్శిగా ఆదిలక్ష్మి, కోశాధికారిగా భాగ్యలక్ష్మితో రోటరీక్లబ్ పాస్ట్ జిల్లా చైర్మన్ వనజ మోహన్ ప్రమాణం చేయించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ టీం మెంబర్లు సత్రసాల ప్రసన్నకుమార్, వెంకటేశులు, సహ కార్యదర్శి హరి, పెద్దారెడ్డి, బండారు చలం, కె.శ్రీనివాసులు, రత్నశేఖర్‌రెడ్డి, కొండయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలపై అవగాహన కల్పిస్తాం



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్

ధర్మవరం అర్బన్: రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించి, రక్తదాన ఆవశ్యకతపై వివరిస్తామని శ్రీసత్యసాయి జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం రెడ్‌క్రాస్ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్‌లో రక్తదానంతో పాటు నేత్రదానంపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. అనంతరం పలువురితో రెడ్‌క్రాస్ సంస్థ సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు డాక్టర్ సత్యనిర్థారణ్, న్యాయవాది అతావుల్లా, నరేంద్రరెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి

రామగిరి: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠకులతో గ్రంథాలయ నిర్వహణ, సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠకులకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. సెస్సు సక్రమంగా చెల్లించి గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, గ్రంథాలయాధికారి వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి



ఎంపికైన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

ధర్మవరం అర్బన్: లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేయాలని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ రమేష్‌నాథ్ రెడ్డి సూచించారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ పేదల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. క్లబ్ స్థాపించినప్పటి నుంచి వేల మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయించామని తెలిపారు. అదే సంకల్పంతో మరిన్ని సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకుడు పిట్టా వెంకటస్వామి, లయన్స్‌క్లబ్ సభ్యులు బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, నారాయణరెడ్డి, వెంకటస్వామి, గోసే రాధాకృష్ణ, జయకుమార్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, శాగా సురేష్, శివప్రసాద్, కృష్ణ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గూడూరు మోహన్‌దాస్, కార్యదర్శిగా గూడూరు రాజగోపాల్, కోశాధికారిగా వేణుగోపాలాచార్యులు, ఉపాధ్యక్షులుగా పుట్లూరు నరసింహులు, అజయ్‌కుమార్, జగదీశ్వరప్రసాద్, సహాయ కార్యదర్శిగా వెంకటేష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. సహాయ కోశాధికారిగా కొత్త శ్రీరాములు, ట్యామర్‌గా రాధాకృష్ణ, టైల్ ట్విస్టర్‌గా నాగరాజు, డైరెక్టర్లుగా మరో 11 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారితో మాజీ గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు.

పేద రైతులందరికీ ఉచిత బోర్లు



బోరు తవ్వకాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

కనగానపల్లి: తోపుదుర్తి ట్రస్టు సహకారంతో గ్రామాల్లో పేద రైతులందరికీ ఉచితంగా బోర్లు వేయిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్ తెలిపారు. నరసంపల్లిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, పలువురు నాయకులతో కలసి ఆయన ఉచిత బోర్లు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జలకళ కార్యక్రమం ద్వారా అనేక మంది రైతులకు ఉచితంగా బోర్లు వేయించిందన్నారు. అయితే రాప్తాడు నియోజకవర్గంలో చాలా మంది రైతులు దరఖాస్తు చేసుకోవటంతో, అర్హులైన వారందరికీ న్యాయం చేయాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తన డబ్బుతో తోపుదుర్తి ట్రస్టు ద్వారా పేద రైతులందరికీ ఉచితంగా బోర్లు వేయిస్తున్నారన్నారు. వీటిని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకొని వ్యవసాయ పంటలు సాగు చేసుకొని జీవనోపాధిని పెంపొందించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గంగుల సుధీర్‌రెడ్డి, రమణారెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, యూత్ కన్వీనర్ అశోక్, నాయకులు పెద్దిరెడ్డి, ఆలమూరప్ప, శ్రీనివాసులు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని వినతి

నల్లమాడ: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నేషనల్ హెల్త్ మిషన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయాలని ఉద్యోగులు కోరారు. ఆదివారం ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఎం.గోపీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కరించాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. మినిమం టైం స్కేలు అమలు చేయాలన్నారు. జీఓ నంబర్ 60 ప్రకారం 2022 నవంబర్ నుంచి అరియర్స్ ఇవ్వాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీ, హెల్త్, జనరల్ ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం, హెచ్‌ఆర్ సెల్, గ్రీవెన్స్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. పరస్పర ఒప్పంద బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు.

షిర్డీసాయి భక్తుల భిక్షాటన



విరాళాలు సేకరిస్తున్న భక్తులు

కదిరి టౌన్: జూలై 3వ తేదీన జరిగే గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం షిర్డీసాయి భక్తులు భిక్షాటన చేపట్టారు. వాణి వీధిలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయి చిత్రపటాన్ని ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, చెక్క భజన, కోలాటం ఆడుతూ విరాళాలు సేకరించారు. పట్టణంలోని కాలేజ్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, ఇందిరాగాంధీ సర్కిల్, టవర్‌క్లాక్, హిందూపురం రోడ్డు మీదుగా కోనేరు సర్కిల్ నుంచి షిర్డీ సాయిబాబా ఆలయం వరకూ భిక్షాటన కొనసాగింది.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నల్లచెరువు: మండల పరిధిలోని రాగన్నగారి పల్లి వద్ద ఉన్న నేరేడు పండ్లతోటలో ఆదివారం ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. చిత్తూరు జిల్లా బోయకొండకు చెందిన దొరబాబు (25) అనే యువకుడు 10 రోజుల క్రితం కూలి పని కోసం రాగన్నగారి పల్లికి వచ్చాడు. భార్యతో కలిసి రాగన్నగారి పల్లి వద్ద ఉన్న నేరేడు పండ్ల తోటలోని షెడ్‌లో నివాసం ఉంటున్నాడు. అయితే భార్యతో మనస్పర్థల కారణంగా తరచూ గొడవ పడేవాడు. భార్య ప్రవర్తనతో విసిగిపోయిన దొరబాబు ఆదివారం నేరేడు చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వరలక్ష్మి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మేడాపురంలో వివాహిత..

చెన్నేకొత్తపల్లి: మేడాపురం గ్రామంలో ఓ వివాహిత విషద్రావకం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ శ్రీధర్ తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన మమత (30) భర్త సురేష్‌తో కలిసి కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. ఆదివారం తన ఇంట్లో విషద్రావకం తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు ఆమెను 108 లో ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలికి భర్త , ఇద్దరు సంతానం ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. మృతికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కదిరి: పట్టణంలోని 17వ వార్డులో సోమవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టైటానిక్ ఫంక్షన్ హాల్ వద్ద నుంచి ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కౌన్సిలర్లు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

డి.చెర్లోపల్లిలో రేపు..

బత్తలపల్లి: మండలంలోని డి.చెర్లోపల్లి గ్రామంలో ఈనెల 27వ తేదీన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. అదే విధంగా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నూతన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగినికి సీమంతం

ధర్మవరం రూరల్: స్థానిక 25వ వార్డు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న వార్డు ఎమినిటీస్ సెక్రటరీ జి.సరితకు ఆదివారం మహిళలు సీమంతం చేశారు. కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

నిరుపేదలకు సేవలందించడంలోనే సంతృప్తి



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ధర్మవరం అర్బన్: నిరుపేదలకు సేవలందించడంలోనే నిజమైన సంతృప్తి కలుగుతుందని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన కావేరి ఆసుపత్రి వైద్యులు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్లు సౌమ్య, అనూష తదితరులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు, కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. నిరుపేదలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ కార్యదర్శి సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, పీఆర్‌ఓ జయరాం, సభ్యులు డాక్టర్ బీవీ సుబ్బారావు, నామాల శ్రీనివాసులు, రమేష్‌బాబు, నాగార్జున, కావేరి ఆసుపత్రి పీఆర్‌ఓ మునీంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'హర్ దిల్ మే వైఎస్సార్.. హమ్ సబ్ జగన్ కే సాత్'



కె.పూలకుంటలో సంక్షేమ పథకాల కరపత్రాలను చూపుతున్న జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ నూరుల్లా

నల్లచెరువు: మండల పరిధిలోని ఉబిచర్ల, దేవరింటిపల్లి, కె.పూలకుంట గ్రామాల్లోని మసీదుల్లో ఆదివారం జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ నూరుల్లా ఆధ్వర్యంలో హర్ దిల్ మే వైఎస్సార్.. హమ్ సబ్ జగన్ కే సాత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు, మసీద్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లింల సంక్షేమానికి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ముస్లింల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో బాషా ఖాన్, గయాజుద్దీన్, మహబూబ్ బాషా, బాబా ఫకృద్దీన్, ముజాహిద్, సమీవుల్లా, మాజీ సర్పంచ్ అక్బర్, ముత్తవలి మహమ్మద్ షాకీర్, షేక్ షాకీర్, ఇమాం ఖాసీం, జిలాన్ బాషా, ఫయాజ్, పి.ఖాదర్‌వలి, ఎస్.ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మఒడి లబ్ధిదారులతో ర్యాలీ

ధర్మవరం: పట్టణంలో సోమవారం ఉదయం 9:30 గంటలకు అమ్మ ఒడి లబ్ధిదారులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. గాంధీనగర్‌లోని మారుతి రాఘవేంద్ర స్వామి కల్యాణ మండపం నుంచి పీఆర్‌టీ సర్కిల్ మీదుగా ఆర్‌అండ్‌బీ కార్యాలయం వరకు ర్యాలీ సాగుతుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అమ్మ ఒడి లబ్ధిదారులు ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

ర్యాలీకి తరలిరండి

బత్తలపల్లి: ధర్మవరం పట్టణంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీకి మండలంలోని అమ్మ ఒడి లబ్ధిదారులు తరలిరావాలని ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ కోరారు. బత్తలపల్లి శివాలయం నుంచి బయలుదేరి ధర్మవరం వెళ్లనున్నట్లు తెలిపారు.

ముదిగుబ్బ: ధర్మవరం పట్టణంలో సోమవారం ఉదయం 10 గంటలకు జగనన్న అమ్మఒడి లబ్ధిదారులతో కలిసి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భారీ ర్యాలీ నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి ఆదివారం ఓ ప్రకటలో తెలిపారు. కార్యక్రమానికి ముదిగుబ్బ మండలం నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు, తల్లిదండ్రులు తరలిరావాలని కోరారు.

ముగిసిన అక్క దేవతల ఉత్సవం



అలంకరణలో అక్క దేవతల విగ్రహాలు



నెమలి ఈకలతో నివేదన చేస్తున్న బాలురు

పుట్టపర్తి అర్బన్: పెడపల్లి సమీపంలోని దొడ్డిగుండ్లులో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న అక్క దేవతల పరుష ఆదివారం ముగిసింది. ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకుని ఏటా మూడు రోజుల పాటు అక్క దేవతలకు పూజలు నిర్వహిస్తారు. మూడవ రోజున వేలాది మంది భక్తుల నడుమ బాలికలు, బాలురు విడివిడిగా కుంకాలు చెరిగే కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఆలయంలో కొలువుదీరిన 7 మంది అక్క దేవతలకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కొబ్బరి కాయలు కొడతారు. అక్క దేవతలకు ప్రతి రూపంగా 7 మంది కన్నె పిల్లలు, 7 మంది బాలురకు చన్నీటి స్నానాలు చేయించి కుంకాలు ఆడిస్తారు. అనంతరం నెమలి ఈకలతో నివేదన చేస్తారు. ఈ ఉత్సవాలను గ్రామానికి చెందిన కాయల వంశీయులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.